## ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 19-10-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ పారిశ్రామిక ప్రోత్సాహకాల కింద మొదటి విడతగా 1,500 కోట్ల రూపాయలను విడుదల చేస్తున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు.
- ❖ నాటక రంగ కళాకారులకు ప్రత్యేక పెన్షన్ అందించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.
- ❖ ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఐ.టి. శాఖా మంత్రి నారా లోకేశ్ అన్నారు.
- ❖ ఈ నెల 21న బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది.

==========================

పారిశ్రామిక ప్రోత్సాహకాల కోసం మొదటి విడతగా 1,500 కోట్ల రూపాయలను విడుదల చేస్తున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఈ రోజు వెల్లడించారు. ఆర్థిక సవాళ్లు ఉన్నప్పటికీ, పరిశ్రమలకు మద్దతుగా నిలిచేందుకు, పెట్టుబడిదారుల విశ్వాసాన్ని బలోపేతం చేసేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌ను వ్యాపారం, వృద్ధికి అనుకూలమైన గమ్యస్థానంగా మార్చేందుకు కృత నిశ్చయంతో ఉన్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్ణయం పట్ల ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ హర్షం వ్యక్తం చేసింది.

==========================

ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఐటి శాఖా మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న లోకేశ్ ఈ రోజు సిడ్నీలో ప్రవాసాంధ్రులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత 16 నెలల్లో 10 లక్షల కోట్ల రూపాయలు పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ సహకారం వల్లే విశాఖపట్టణంలో గూగుల్ డేటా సెంటర్ వచ్చిందని తెలిపారు. రాష్ట్రానికి మేలు చేసే ఎలాంటి

అవకాశాన్ని కూడా వదిలిపెట్టవద్దని, ఆస్ట్రేలియా కంపెనీల్లో పనిచేసే తెలుగువారు రాష్ట్ర ప్రచారకర్తలుగా వ్యవహరించాలని కోరారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ప్రధమ స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తున్నామని మంత్రి లోకేశ్ పేర్కొంటూ...

(వాయిస్ 33 సెకన్లు)

==========================

నాటక రంగ కళాకారులకు ప్రత్యేక పెన్షన్ అందించేందుకు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖా మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. విజయనగరం జిల్లా రాజాంలో జి.ఎమ్.ఆర్ వరలక్ష్మి కళాక్షేత్రాన్ని ఆయన ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... కళలను పరిరక్షించి భావితరాలకు అందించేందుకు కూటమి ప్రభుత్వం సాంస్కృతిక, కళారంగానికి పెద్దపీట వేస్తోందని అన్నారు. నాటక సమాజాలు రిజిస్టర్ చేసుకుంటే, కళాకారులకు ప్రభుత్వం తరఫున సహకారం అందించేందుకు వీలుంటుందని మంత్రి స్పష్టం చేశారు.

==========================

ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ రాష్ట్ర ప్రజలకు ఈ రోజు దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. దీపావళి దివ్య కాంతులు అందరికీ శాంతి, శ్రేయస్సు, ఆనందాన్ని తెస్తాయని, ఈ పండుగ చీకటిపై కాంతి, చెడుపై మంచి, అజ్ఞానంపై జ్ఞానం సాధించిన విజయానికి సంకేతంగా నిలుస్తుందని గవర్నర్ తన సందేశంలో పేర్కొన్నారు. దీపావళి వెలుగులు చీకటి ఆలోచనలను నాశనం చేసి, సమాజంలోని చెడును నిర్మూలిస్తూ.. ఒకరికొకరు సహాయం చేసుకునే శక్తిని, ఇంకా ఉత్సాహాన్ని ఇస్తాయన్నారు.

రాష్ట్ర ప్రజలందరికీ ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ ఈ రోజు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక దీపావళి అని పవన్ కళ్యాణ్ అన్నారు. ప్రజలంతా దీపావళిని పర్యావరణహితంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు.

విరామం

==========================

రాష్ట్రంలో రహదారుల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళుతుందని రవాణా, యువజన, క్రీడల శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణం కే.రామాపురంలో 60 లక్షల రూపాయలతో నిర్మించిన సిమెంట్ రోడ్డు పనులను ఆయన ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ... పట్టణంలోని వరద ముప్పు ప్రాంతాలు, శివారు కాలనీల్లో సిమెంట్ రహదారులు నిర్మిస్తామని తెలిపారు. తాగునీటి సమస్య పరిష్కారానికి 98 కోట్ల రూపాయలతో వెలిగల్లు నుంచి రెండో నీటి పథకం పనులు చేపట్టామని, త్వరలోనే పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

==========================

కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ రేట్లను తగ్గించడంతో అన్ని వర్గాల ప్రజలకు ఎంతో లబ్ది కలుగుతుందని తిరుపతి జిల్లా సంయుక్త కలెక్టర్ నారపురెడ్డి మౌర్య అన్నారు. తిరుపతి నగరంలో ఈరోజు జరిగిన సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్.. ముగింపు కార్యక్రమంలో పాల్గొని జీఎస్టీ మేళాను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... జీఎస్టీ రేట్ల తగ్గింపుతో ప్రజలకు అవసరమైన పలు వస్తువుల ధరలు తగ్గాయన్నారు. రేట్ల తగ్గింపుపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని జాయింట్ కలెక్టర్ వివరిస్తూ...

(వాయిస్ 33 సెకన్లు)

==========================

శ్రీకాకుళం జిల్లా శ్రీకూర్మం క్షేత్రాన్ని అంతర్జాతీయ స్థాయిలో భక్తులను ఆకర్షించే విధంగా అభివృద్ధి చేస్తామని పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. గార మండలంలోని శ్రీ కూర్మనాథ స్వామి వారి ఆలయాన్ని ఆయన ఈ రోజు సందర్శించారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ... ఏడో శతాబ్దంలో నిర్మించిన ఈ ఆలయం ప్రపంచంలో ఎక్కడా లేని శిల్ప కళా సంపద కలిగి ఉందని తెలిపారు. విజయనగరం రాజులు నిర్మించిన ఈ ఆలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి భక్తులకు పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు.

===========================

ఆగ్నేయ బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో భారీ వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయని అమరావతిలోని వాతావరణ కేంద్రం  అధికారులు తెలిపారు. ఈ నెల 21న బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వెల్లడించారు. 22 నుంచి రాష్ట్రంలో భారీ నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. మరిన్ని వివరాలను వాతావరణ కేంద్రం అధికారి ఎల్. నారాయణ వెల్లడిస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

===========================
===========================